సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ၊ 6 ၊ నవంబర్ ၊ 2023



పకడ్బందీగా బందోబస్తు

కొత్తగూడెంలో ఆదివారం సీఎం కేసీఆర్ హాజరైన ప్రజా ఆశీర్వాద సభకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 10లో



ఎన్నికల విధుల్లో వీరే కీలకం

ఎన్నికల సందర్భంగా బూత్ లెవెల్ అధికారి నుంచి జిల్లా ఎన్నికల అధికారి వరకు పలు వురు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు. 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30°/23°

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. రాత్రికి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు పుష్యమి పట్టాభిషేకం

రామాలయంలో భక్తుల సందడి



నిత్యకల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం పుష్యమి నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకం వేడుకను వైభవంగా నిర్వహించారు. అంతకుముందు అంతరాలయంలో మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఆదివారం సెలవు కావడంతో రామాలయంలో భక్తుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులుదీరారు. స్వామివారి ఆర్జిత సేవలతో పాటు నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


రామయ్యను దర్శించుకున్న దేవనాథ జీయర్



ఈఓ రమాదేవితో మాట్లాడుతున్న జీయర్ స్వామి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామి వారిని దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ ఈఓ రమాదేవి ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, ఉపాలయాల్లో స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆ తర్వాత ఈఓ రమాదేవితో ఆలయ అభివృద్ధి, తదితర అంశాలపై మాట్లాడారు.

వనమాను గెలిపిస్తే మరింతగా అభివృద్ధి





ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, వేదికపై విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు, ఎంపీ వద్దిరాజు తదితరులు

ఆయన తరఫున నేను హామీ ఇస్తున్నా

- సింగరేణిలో కారుణ్య నియామకాలు తెచ్చాం
- ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ పోయింది
- సీతారామా ప్రారంభోత్సవానికి నేనే వస్తా
- కొత్తగూడెం ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'కొత్తగూడెం అభివృద్ధికి వనమా వెంకటేశ్వరరావు తరఫున నేను హామీ ఇస్తున్నా' అని సీఎం కేసీఆర్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో వనమాను గెలిపించాలని ఓటర్లకు కోరారు. ఆదివారం మధ్యాహ్నం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు.

వార్డు సభ్యుడి నుంచి

వార్డు మెంబర్ స్థాయి నుంచి సర్పంచ్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రి స్థాయి వరకు ఎదిగిన వనమా చాలా పెద్ద మనిషని సీఎం కేసీఆర్ అన్నారు. అందువల్లే తాను ఏరికోరి వనమాను పార్టీలోకి తెచ్చుకున్నానని చెప్పారు. ఆయన ఎన్నోసార్లు తన దగ్గరకు వచ్చారని, ఎప్పుడైనా నియోజకవర్గ అభివృద్ధి పనులు తప్ప వ్యక్తిగత, కుటుంబపరమైన పనులను ఏనాడూ అడగలేదని అన్నారు. ఆఖరికి రాజకీయ పదవులు కావాలని కూడా ఏ రోజూ కోరలేదన్నారు. మంచి మనిషైన వనమాను రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఐదారు రోజులు కొత్తగూడెంలోనే ఉండి సమీక్షలు నిర్వహించి, పట్టణానికి ఏం కావాలో అది చేస్తానని హామీ ఇచ్చారు.

నాడు నష్టాల్లో సింగరేణి..

కాంగ్రెస్ హయాంలో సింగరేణి సంస్థ నష్టాల్లో ఉండేదన్నారు. నాడు సింగరేణి టర్నోవర్ రూ.11వేల కోట్లు ఉంటే.. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రస్తుతం రూ.33 వేల కోట్లకు చేరుకుందని, ఆ రోజుల్లో లాభాలు రూ.419 కోట్లు మాత్రమే ఉంటే ఇప్పుడు రూ. 2,024 కోట్లకు చేరాయని వివరించారు. లాభాల్లో వాటాగా అప్పట్లో రూ.70 కోట్లు ఇస్తే ఇప్పుడు ఏకంగా రూ.700 కోట్లు ఇచ్చే స్థాయికి సంస్థ ఎదిగిందని చెప్పారు. కాంగ్రెస్, సీపీఐ అనుబంధ యూనియన్ల హయాంలో కారుణ్య నియామకాలను కార్మికులు కోల్పోయారని, తెలంగాణ వచ్చాక కారుణ్య నియామకాలను అమల్లోకి తెచ్చామని, తద్వారా ఇప్పటి వరకు 15 వేల మందికి సంస్థలో ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక 19 వేల మంది సంస్థలో చేరారని, తద్వారా సింగరేణిలో యువరక్తం ఉప్పొంగుతోందని అన్నారు. సంస్థలో పని చేస్తూ కార్మికుడు చనిపోతే ఇచ్చే నష్టపరిహారాన్ని కూడా పెంచామని చెప్పారు. వడ్డీలేని ఇంటి రుణాలు అందిస్తున్నామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు..

ఉద్యమ సమయంలో తాను రెండు డజన్ల సార్లు కొత్తగూడెం వచ్చానని సీఎం కేసీఆర్ గతాన్ని గుర్తు చేసుకున్నారు. సమైక్య రాష్ట్రంగా కొనసాగి ఉంటే కొత్తగూడెం జిల్లా కేంద్రంగా ఏర్పడేది కాదని, ఇప్పుడు జిల్లా కావడంతో పాటు మెడికల్ కాలేజీ కూడా వచ్చిందని అన్నారు. వైద్య సేవల కోసం హైదరాబాద్, ఖమ్మం వెళ్లాల్సిన బాధలు తప్పాయని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత కరెంట్, తాగునీటి సమస్యలు పరిష్కారం అయ్యాయని, కొత్తగూడెంలో రోడ్లు బాగయ్యాయని వెల్లడించారు. ముర్రేడు వాగు ముంపు నివారణకు రూ.30 కోట్లు ఇచ్చామన్నారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని పేర్కొన్నారు.

దోపిడీ తగ్గింది

తెలంగాణ రాకముందు ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ జరిగేదని, కేసీఆర్ కిట్, అమ్మఒడి పెట్టిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయని చెప్పారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ తగ్గిందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో 16 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు రైతుబంధు, రైతుబీమా అమలు చేస్తున్నామన్నారు. పోడు రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేశామని తెలిపారు.

'సీతారామ' ప్రారంభిస్తాం

సీతారామ ప్రాజెక్టు పనులు 70 శాతం మేర పూర్తయ్యాయని కేసీఆర్ చెప్పారు. మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన 30 శాతం పనులు కూడా పూర్తి చేసి, ఆ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి స్వయంగా తానే వస్తానని హామీ ఇచ్చారు. ఒకప్పుడు బోరులో నీళ్లు పడాలంటే ఆరేడు వందల అడుగుల వరకు బోరు వేయాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు పైపైనే నీళ్లు పడుతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన విధానాల కారణంగా 730 టీఎంసీల భూగర్భ జలాలు రీచార్జ్ అయ్యాయని తెలిపారు.

50 వేల మెజారిటీ గ్యారంటీ..

బహిరంగ సభ ముగిసిన తర్వాత సీఎం కేసీఆర్‌కు వీడ్కోలు చెప్పేందుకు బీఆర్‌ఎస్ నేతలంతా ప్రగతిమైదాన్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ దగ్గరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వనమాను సీఎం కేసీఆర్‌ను దగ్గరకు పిలుచుకున్నారు. 'వనమా, నువ్వు మంచి వర్కర్‌వి, మీకు జనాల్లో మంచి పేరుంది. ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తావ్. యాభై వేల మెజారిటీ వస్తుంది. టెన్షన్ పడకు' అని అన్నారు.

సైడ్ లైట్స్


- భద్రాద్రి రాముడికి పాదాభివందనం చేస్తూ కేసీఆర్ ప్రసంగం ప్రారంభించారు. రాముడి పేరు మీదే జిల్లాకు భద్రాద్రి కొత్తగూడెం అని పేరు పెట్టామని చెప్పారు.
- సీఎం కేసీఆర్ వేదిక మీదకు చేరుకోగానే ఒక్కసారిగా సభా ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. నలువైపులా ఈలలు వినిపించాయి. సభకు వచ్చిన వారంతా కేసీఆర్‌ను చూసేందుకు ఒక్కసారిగా లేచి నిలబడ్డారు.
- కేసీఆర్ ప్రసంగం ప్రారంభించిన తర్వాత కూడా ఈలలు కొనసాగాయి. దీంతో కేసీఆర్ పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అరవడం, సీటీలు కొట్టడం మానెయ్యాలి, పదిమంది అరిస్తే సభ మొత్తం ఆగమైతది', 'ఎవడయ్య వాడు, మనిషేనా నాకర్థం కాదు' అంటూ కోపం ప్రదర్శించారు.
- ఈలలు, కేకలు అదుపు చేసేందుకు వనమా, వద్దిరాజు, నామా ప్రయత్నించారు.
- సీఎం కేసీఆర్ సభా ప్రాంగణానికి చేరుకోవడానికి ముందు గాయని మధుప్రియ సభికులను ఉత్సాహపరిచారు. ఈ క్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఇతర కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ మహిళా నేతలు వేదికపై ఆడిపాడారు. కొంత సేపటి తర్వాత ఎమ్మెల్యే వనమా సైతం వీరితో పాదం కదిపారు.
- సీఎం కేసీఆర్ ప్రగతి మైదానంలోని హెలిప్యాడ్‌కు 3.05 ని.లకు చేరుకున్నారు
- 3.13 నిమిషాలకు ప్రకాశం స్టేడియంలోని సభా వేదికపైకి వచ్చారు
- 3.14 ని.ల నుంచి 3.46 ని.ల వరకు ప్రసంగించారు
- 3.50 నిమిషాలకు తిరిగి ప్రగతి మైదానానికి చేరుకుని అక్కడి నుంచి ఖమ్మం బయలుదేరారు.
- మొత్తంగా ఆయన కొత్తగూడెంలో 45 నిమిషాల పాటు గడిపారు.



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

జంగ్ తెలంగాణ

కేసీఆర్ సహకారం మరువలేనిది..



మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీఎం కేసీఆర్ సహకారంతోనే కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ఆయన సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో వనమా మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గం తనకు జన్మభూమి, కర్మభూమి అని వ్యాఖ్యానించారు. వార్డు సభ్యునిగా రాజకీయ జీవితం ప్రారంభించానని. సర్పంచ్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, ఆర్టీసీ చైర్మన్‌గా, మంత్రిగా అహర్నిశలూ ప్రజాసేవకే అంకితమయ్యానని అన్నారు. సీఎం కేసీఆర్ నాకు చాలా ధైర్యం కల్పించారని, అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారని కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ తెలంగాణ సాధకుడని, ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ప్రత్యేక రాష్ట్రం సాధించారని కొనియాడారు. పాల్వంచలో పేదల ఇళ్లకు తాను ఉద్యమ సమయంలోనే కేసీఆర్ నగర్‌గా నామకరణం చేశామని గుర్తు చేశారు. అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ఆయన తనకు దేవుడి వంటి వారన్నారు. కారు గుర్తుపై ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సభలో ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, విప్ రేగా కాంతారావు, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, భద్రాచలం అభ్యర్థి తెల్లం వెంకట్రావు, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ నాయకులు తాళ్లూరి వెంకటేశ్వరరావు, కోనేరు సత్యనారాయణ, టీబీజీకేఎస్ నాయకులు వెంకట్రావ్, రాజిరెడ్డి, కెంగెర్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గద్దె దించడమే లక్ష్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ మాటల గారడీతో ప్రజలను మభ్య పెడుతూ పాలన సాగించారని, ఆయన మాటలను రాష్ట్ర ప్రజలు ఇక నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా ప్రజలకు అన్యాయం చేశారని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి, దళిత, బీసీ, మైనార్టీ బంధు వంటి పథకాలు అర్హులకు అందలేదని, గులాబీ నేతల జేబులు నింపే పథకాలుగా మారాయని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో గతంలో జరిగిన అభివృద్ధే తప్ప కేసీఆర్ హయాంలో చేసిందేమీ లేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెంలో ఎర్రజెండా గెలుపును అడ్డుకునే శక్తి ఎవరికీ లేదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, నాయకులు బందెల నర్సయ్య, ముత్యాల విశ్వనాథం, మున్నా లక్ష్మీకుమారి, దుర్గా రాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, జి.వీరస్వామి, వంగా వెంకట్, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, వి.మల్లికార్జున్‌రావు, మునిగడప వెంకటేశ్వర్లు, కె. రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, గుండు శ్రీనివాస్, రమణమూర్తి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లభించని కౌన్సిలర్ల ఆచూకీ

కొత్తగూడెం మున్సిపాలిటీలో సీపీఐకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు రెండు రోజులుగా అజ్ఞాతంలోనే ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి వరకు పార్టీ సీనియర్ నాయకులు వారికి ఫోన్ చేసినా స్పందించలేదు. వారి ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేదు. అయితే ఆదివారం నాటి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ సమక్షంలో వీరు బీఆర్‌ఎస్‌లో చేరుతారనే ప్రచారం జరిగినా.. వారి జాడ మాత్రం కనిపించలేదు. ఎక్కడికి వెళ్లారనే విషయం ఎవరికీ అంతుపట్టడం లేదు.

ఆమె గళం.. అంతంతే!



తేళ్ల లక్ష్మీకాంతమ్మ



దుగ్గినేని వెంకట్రావమ్మ



కుంజా సత్యవతి



బానోతు చంద్రావతి



బానోతు హరిప్రియ

- అసెంబ్లీకి వెళ్లిన మహిళలు తక్కువే..
- ఉమ్మడి జిల్లా నుంచి కొద్దిమందికే అవకాశం
- 15 ఎన్నికల్లో ఐదుగురిని వరించిన విజయం
- అంతగా ప్రాధాన్యత ఇవ్వని ప్రధాన పార్టీలు
- రెండు జిల్లాల్లో మహిళా ఓటర్లే ఎక్కువ!

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా రాజకీయ రంగంలో మాత్రం పార్టీల నుంచి టికెట్ల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉంటోంది. వారికి రిజర్వేషన్లు ఉన్న స్థానిక సంస్థల్లోనూ భర్త చాటు భార్యలు.. తండ్రి చాటు కూతుర్లకు మాత్రమే టికెట్లు దక్కుతున్నాయనే ప్రచారం ఉంది. స్వశక్తితో రాజకీయాల్లో రాణిస్తున్న మహిళా ప్రతినిధులు తక్కువ మందే ఉంటున్నారు. కొందరు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాలకే పరిమితమవుతుండగా.. చట్టసభల్లో ప్రాతినిధ్యం మాత్రం నామమాత్రంగా కూడా ఉండడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 1952 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన 15 శాసనసభ ఎన్నికల్లో ఐదుగురు మాత్రమే మహిళలు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించారు.

సగానికి పైగా వారే..

గత నెల 4న జారీ చేసిన ఓటర్ల జాబితా ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. మొత్తం 21,41,387 మంది ఓటర్లకు గాను మహిళలు 10,99,548 మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 11,96,293 మంది ఓటర్లకు గాను పురుషులు 5,80,411 మంది, మహిళలు 6,15,807 మంది ఉన్నారు. ఇక భద్రాద్రి జిల్లాలోని 9,45,094 మంది ఓటర్లలో పురుషులు 4,61,315 మంది, మహిళలు 4,83,741 మంది ఉన్నారు. జిల్లాల వారీగానే కాకుండా అన్ని నియోజకవర్గాల్లోనూ వీరే అధికంగా ఉన్నప్పటికీ అవకాశాలు కల్పించడంలో ప్రధాన పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయనే ఆవేదన మహిళా నాయకుల్లో ఉంది.

ఇప్పటి వరకు ఐదుగురు..

స్వాతంత్ర్యం వచ్చాక 1952 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయి. 1952, 57 సంవత్సరాల్లో ద్విసభ్య స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం 1962 నుంచి సాధారణ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 15 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురు మహిళలే ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1957లో ఖమ్మం ద్విసభ్య స్థానానికి జరిగిన ఎన్నికల్లో తేళ్ల లక్ష్మీకాంతమ్మ రెండో అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 1972లో మధిర నుంచి దుగ్గినేని వెంకట్రావమ్మ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009లో భద్రాచలం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కుంజా సత్యవతి, వైరా నియోజకవర్గం నుంచి సీపీఐ తరుపున పోటీ చేసిన బి.చంద్రావతి గెలిచారు. గత ఎన్నికల్లో ఇల్లెందు నుంచి బానోతు హరిప్రియ విజయం సాధించారు. ఇక ఈసారి ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీల్లో పరిశీలిస్తే బీఆర్‌ఎస్ నుంచి ఇల్లెందులో హరిప్రియకు టికెట్ దక్కింది. ఇంకా కాంగ్రెస్, బీజేపీ కొన్ని నియోజకవర్గాలకు టికెట్లు ప్రకటించాల్సి ఉన్నా మహిళలకు అవకాశం దక్కే సూచనలు కనిపించడం లేదు. ఇంకొన్ని పార్టీల్లో మాత్రం మహిళలకు టికెట్లు కేటాయించినా ఎందరు విజయం సాధిస్తారనేది వేచి చూడాల్సిందే.

అప్పుడప్పుడే విజయాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ స్థానాల నుంచి మహిళలు ఐదుగురు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనా ప్రతీ విజయానికి మధ్య ఏళ్ల తరబడి వ్యవధి ఉంది. తొలిసారి 1952లో జరిగిన ఎన్నికల్లో ఖమ్మం నుంచి లక్ష్మీకాంతమ్మ విజయం సాధించగా.. మళ్లీ 1972లో మధిర నుంచి దుగ్గినేని వెంకట్రావమ్మ గెలిచారు. ఆతర్వాత 37 ఏళ్ల అనంతరం 2009 ఎన్నికల్లోనే వైరా నుంచి బానోతు చంద్రావతి, భద్రాచలం నుంచి కుంజా సత్యవతికి విజయం దక్కింది. అనంతరం 2018 ఎన్నికల్లో హరిప్రియ గెలిచారు. ఇంకా కాంగ్రెస్, బీజేపీ జాబితా పూర్తిగా ప్రకటించలేదు. వాటిలో మహిళలకు స్థానం దక్కుతుందేమో చూడాలి. తాజాగా సీపీఎం ప్రకటించిన జాబితాలో సత్తుపల్లి నుంచి మాచర్ల భారతికి టికెట్ కేటాయించారు.

బరిలోకి దిగారు...

- ఉమ్మడి జిల్లాలోని ఏడు స్థానాల్లో సీపీఎం పోటీ
- అభ్యర్థులను ప్రకటించిన నాయకత్వం
- పాలేరు నుంచి పోటీకి దిగుతున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 స్థానాల్లో పోటీ చేస్తామని ఆ పార్టీ ప్రకటించగా.. ఆదివారం 14 స్థానాలకు అభ్యర్థులను వెల్లడించింది. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఖమ్మంతో పాటు పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రధానంగా పాలేరు నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. సీపీఎం తొలుత కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై చర్చలు జరిపినా ఫలప్రదం కాలేదు. కాంగ్రెస్ పార్టీకి తమ్మినేని అల్టిమేటం జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగాలని నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లాలో పోటీ చేసే స్థానాలు, అభ్యర్థులు

నియోజకవర్గం	అభ్యర్థి
పాలేరు	తమ్మినేని వీరభద్రం
ఖమ్మం	యర్రా శ్రీకాంత్
మధిర	పాలడుగు భాస్కర్
వైరా	భూక్యా వీరభద్రం
సత్తుపల్లి	మాచర్ల భారతి
భద్రాచలం	కారం పుల్లయ్య
అశ్వారావుపేట	పిట్టల అర్జున్

పాలేరు బరిలో రెండోసారి..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రెండోసారి పాలేరు నుంచి అసెంబ్లీ బరిలో నిలవనున్నారు. 2004 ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన, టీడీపీ అభ్యర్థి బి.లక్ష్మీనారాయణపై విజయం సాధించారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి వెంకటరెడ్డి చేతిలో ఓడిపోయారు. ప్రస్తుత ఎన్నికల్లో మళ్లీ పాలేరు నుంచి బరిలోకి దిగుతున్నారు. కాగా, ఆయన 1991లో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసినా ఓటమి ఎదురైంది. కానీ 1996లో మాత్రం గెలుపొందారు.

తమ్మినేని వీరభద్రం బయోడేటా..



స్వగ్రామం : తెల్దారుపల్లి, ఖమ్మం రూరల్ మండలం

విద్యాభ్యాసం : ప్రాథమిక విద్య తెల్దారుపల్లిలో, హైస్కూల్ విద్య తల్లంపాడులో పూర్తిచేశారు. కళాశాల విద్య సూర్యాపేట జిల్లా కోదాడలో అభ్యసించారు.

కుటుంబం : భార్య ఉమ, కుమార్తె శృతి, కుమారుడు సంఘమిత్ర

రాజకీయ ప్రవేశం : 1971లో సీపీఎంలో చేరారు. ఖమ్మం డివిజన్, జిల్లా యువజనోద్యమ నిర్మాణానికి కృషి చేశారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

నేడు స్విమ్మింగ్ ఎంపిక పోటీలు



కొత్తగూడెంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అండర్–14, 17 బాలబాలికల స్విమ్మింగ్ ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో పోటీలు జరుగుతాయని భద్రాద్రి డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు తదితర సర్టిఫికెట్లతో రావాలని తెలిపారు. వివరాల కోసం జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శులు కె.నర్సింహామూర్తి, స్టెల్లా ప్రేమ్‌కుమార్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై సస్పెన్షన్ వేటు

మణుగూరుటౌన్: మణుగూరు ఫారెస్ట్ రేంజ్ మనుబోతులపాడు సెక్షన్ మనుబోతులపాడు సౌత్ బీట్ ఆఫీసర్ శశిరేఖను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. రెండు రోజుల కిందట సౌత్ బీట్‌లో 38 తునికి చెట్లను నరికివేశారు. ఈ విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు మణుగూరులో పర్యటించి వివరాలు సేకరించారు. ఆ తర్వాత విచారణలో అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలడంతో శనివారం శశిరేఖను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఆదివారం మణుగూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ద్వాల్యాని వివరణ కోరగా.. సస్పెన్షన్ నిజమేనని చెప్పినా పూర్తి వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

● ఎన్నికల పోటీల్లో నేనే గెలుస్తా !



భద్రాచలం నియోజకవర్గంలో అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య ఆదివారం పట్టణం లోని గ్రౌండ్‌లో వాకర్లతో ముచ్చటించారు. చిన్నా అక్కడ క్రికెట్ ఆడుతున్న వారితో కలిసి కాసేపు బ్యాటింగ్ చేశారు. ఆ తర్వాత వాలీబాల్ కూడా ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

– భద్రాచలం

● మీ 'బరువు' బాధ్యతలు నావే!



పాలేరు బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ అల్లిక వెంకటేశ్వర రావు ఆదివారం నేలకొండపల్లి మండలం సదాశివాపురం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా హమాలీలతోపాటు ధాన్యం బస్తాలను మోస్తూ ఓట్లను అభ్యర్థించారు. తనకు ఒకసారి అవకాశమిస్తే ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని, అభివృద్ధి పాటుపడ తానని భరోసా కల్పించారు.

– నేలకొండపల్లి

● మద్యం సీజ్



దమ్మపేట: కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను ఆదివారం పోలీసులు సీజ్ చేశారు. దమ్మపేట రహదారిపై అనుమానాస్ప దంగా వెళ్తున్న కారును ఆపి, తనిఖీ చేయగా నాలుగు కేసుల మద్యం సీసాలు కనిపించాయి. నిబంధనలకు విరుద్ధంగా దమ్మపేట నుంచి మం డలంలోని జగ్గారం గ్రామానికి తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ హెడ్ కృష్ణ తెలిపారు.



వీరే కీలకం...

ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామ్యంలో అత్యం త కీలకం. ఓటు హక్కుతో ప్రజలు తమకు నచ్చిన వారిని ఎన్నుకునే ప్రక్రియ. ఈ ప్రక్రి యలో ఓటరు నమోదు నుంచి పోలింగ్, లెక్కింపు వరకు అధికార యంత్రాంగానికి శ్రమ తప్పదు. కింది స్థాయి సిబ్బంది మొద లుకుని జిల్లా ఎన్నికల అధికారి వరకు సమ న్వయంతో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అధికారులకు అప్పగించిన బాధ్యతలు సమర్థంగా నిర్వహించాలి.

– భద్రాచలంఅర్బన్

- జీఎల్ఓ నుంచి జిల్లా ఎన్నికల అధికారి వరకు బాధ్యతలు
- సమన్వయంతో పనిచేస్తేనే సజావుగా ఎన్నికల ప్రక్రియ
- ఓటరు జాబితా తయారీ నుంచి ఫలితాల వెల్లడి వరకు అప్రమత్తం..

జిల్లా ఎన్నికల అధికారి

కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. అధికారులకు విధుల కేటాయింపు మొదలుకుని, వారికి ఇచ్చే శిక్షణ, ఇతర కార్యక్రమాలను పర్యవేక్షి స్తారు. నిత్యం సమీక్షల ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేస్తారు. ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు కలెక్టర్‌దే బాధ్యత.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉం టారు. పోలింగ్‌కు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఇతర సామగ్రి తీసుకొస్తారు. ఆ కేంద్రం పూర్తి బాధ్యత ఆయనదే. ఓటింగ్ ముగిసిన తర్వాత యంత్రాలను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంకు తరలిస్తారు. వీరికి సాయంగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. వీరితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. వీరంతా ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉం టుంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎంలు పనితీరును పీఓలు చూడాల్సి ఉంటుంది.

బీఎల్‌ఓలు

గ్రామ, నగరం, పట్టణ స్థాయిలో పనిచేసే వారే బీఎల్‌ఓలు (బూత్ స్థాయి అధికారి). అర్హులైన వారందరిపేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి. కొత్తగా నమోదుతోపాటు మార్పు లు, చేర్పులు, తొలగింపునకు కావాల్సిన దర ఖాస్తులు వారి వద్ద ఉంటాయి. ఓటరు జాబితా తయారీలో పైస్థాయి అధికారులకు సహకారం అందిస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్వో)

ప్రతీ నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి ఉంటారు. వీరిని ఎన్నికల సంఘం నియ మిస్తుంది. వారు తమ పరిధిలో ఎన్నికల ప్రక్రి యను పర్యవేక్షిస్తారు. నామినేషన్ స్వీకరణ మొదలు, పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు వారిదే బాధ్యత.

సెక్టోరియల్ అధికారి

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించే బాధ్యత సెక్టోరియల్ అధికారిపై ఉంటుంది. ర్యాంప్ ఏర్పాటు, విద్యుత్, తాగునీరు, మౌలిక వస తులు కల్పించే విధంగా చూస్తారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రం తోపాటు పరిసరాల్లో ప్రశాంత వాతావ రణం ఉండేలా చూడాలి. పోలింగ్ సమ యంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా వారిదే బాధ్యత.

జంగ్ తెలంగాణ

ఓట్లు రాకుంటే డిపాజిట్ గల్లంతు

- పోలైన ఓట్లలో ఆరో వంతు రావాల్సిందే..
- లేకపోతే అంతే సంగతులు

బూర్గంపాడు: ఎన్నికల్లో పోటీ చేసిన చాలామంది అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కలేదంటుం టారు. ఎన్నికల ప్రచార సభల్లో ప్రత్యర్థులకు డిపా జిట్ దక్కనీయకుండా చేస్తామని నాయకులు చెబు తుంటారు. అసలు ఈ డిపాజిట్‌లు రాకపోవటం అంటే ఏమిటో తెలుసుకుందామా..

● **నామినేషన్ సమయాన..**

ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు నామినేషన్ సమయాన నిర్ణీత మొత్తంలో నగదు రిటర్నింగ్ అధి కారికి జమ చేయాలి. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు జనరల్ స్థానంలో రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లోనైతే రూ.5 వేలు డిపాజిట్ చేయాలి. ఈ డిపాజిట్లను ఎన్నికల సం ఘం ప్రభుత్వ ట్రెజరీలో జమచేస్తుంది.

● **భారీగా ఖర్చు**

అభ్యర్థులు నామినేషన్ వేసినప్ప ట్నుంచి నామినేషన్ల పరిశీలన, ధ్రువీకరణ, గుర్తుల కేటా యింపు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ఓట్ల లెక్కింపు వరకు అధికార యం త్రాంగం రోజుల తర బడి పనిచేయాల్సి ఉం టుంది. అభ్యర్థుల ప్రచార ఖర్చులు, డబ్బు, మద్యం పంపిణీ వంటి వాటిపై కూడా అధికారులు దృష్టి సారించాల్సి ఉం టుంది. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేం దుకు అనేకమంది అధికారులు, ఉద్యోగులు నిశిత పరిశీలన చేయాలి. ఇవన్నీ చేసేందుకు ఎన్నికల సం ఘానికి ఖర్చు కూడా బాగానే అవుతుంది.

● **అందరినీ అనుమతిస్తే..**

కొందరు ఎన్నికలలో సరదాగా పోటీ చేస్తుంటారు. డిపాజిట్ చెల్లించకుండా పోటీ చేయనిస్తే చాలామం ది బరిలో నిలబడితే ఖర్చు మరింత పెరుగుతుంది. దీనిని నియంత్రించేందుకు ఎన్నికల సంఘం నగదు డిపాజిట్ అమలుచేస్తుంది. ఎన్నికల సం ఘం పోటీచేసే అభ్యర్థుల నుంచి డిపాజిట్ స్వీకరి స్తుంది.

● **తిరిగి చెల్లింపు..**

ఓట్ల లెక్కింపు ముగిసిశాక డిపాజిట్ అభ్యర్థులకు చెల్లిస్తారు. ఇందుకు కొన్ని షరతులు విధించారు. డిపాజిట్ దక్కాలంటే ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఆరో వంతు పోటీ చేసిన అభ్యర్థి దక్కించుకోవాలి. అంటే పోలైన వాటిలో 16.66 ఓట్లు పడాలి. కాగా, వందకు దాదాపుగా 17 ఓట్లు పొందాలి. అలా పొం దిన అభ్యర్థులకు డిపాజిట్ తిరిగి చెల్లిస్తారు. లేదం టే అభ్యర్థులకు డిపాజిట్ మొత్తం తిరిగి ఇవ్వకుం డా ఎన్నికల సంఘం ఖాతాలో జమ చేస్తారు. దీనినే డిపాజిట్ గల్లంతు అని అంటారు. కాగా, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 నియోజక వర్గాల్లో 1,852 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో 1,548 మంది అభ్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, పక్కన మెచ్చా తదితరులు

ఎంపీ నామా నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి: బీఆర్‌ఎస్ ప్రకటించిన పథకాలను గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకుడు జంగాల శ్రీనివాసరావు మామిడి తోటలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం లో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా రాష్ట్రంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ఈ ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, తిరిగి ఇప్పుడు అధికారం ఇవ్వా లని కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 13న దమ్మపేటలో జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్ చార్జ్ వెంకటరమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ భారత లాలమ్మ, ఎంపీపీ సున్నం లలిత, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీటీసీ కృ ష్ణారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి తలపడుతున్నారు..

- పినపాకలో పాయం వర్సెస్ రేగా
- పార్టీలు మారినా ప్రత్యర్థులు వారే



రేగా కాంతారావు



పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: పినపాక అసెంబ్లీ నియోజకవర్గంలో మూడుసార్లు ఆ ఇద్దరు అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొంది. అయితే పార్టీలు మాత్రం మారుతు న్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పినపాక నియోజవర్గం లో ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటే శ్వర్లు తలపడుతున్నారు. 2009లో నియోజవర్గాల పునర్విభజనలో బూర్గంపాడు అసెంబ్లీ నియోజకవ ర్గం పినపాక నియోజకవర్గంగా రూపాంతరం చెం దింది. 2009లో జరిగిన పినపాక అసెంబ్లీ తొలి ఎన్నికలలో కాంగ్రెస్ నుంచి రేగా కాంతారావు, సీపీఐ నుంచి పాయం వెంకటేశ్వర్లు పోటీ పడ్డారు. ఆ ఎన్నికలలో రేగా కాంతారావు స్వల్ప మెజారిటీ తో విజయం సాధించి పినపాక నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో జరిగిన అసెం బ్లీ ఎన్నికలలో పాయం వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేయగా, కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మె ల్యేను కాదని పొత్తులో భాగంగా సీపీఐకి ఈ సీటును కేటాయించింది. ఈ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ శంకర్‌నాయక్‌పై పాయం విజయం సాధించారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పాత ప్రత్యర్థులు మళ్లీ తలపడ్డారు. కాంగ్రెస్ నుంచి రేగా కాంతారావు పోటీ చేయగా, బీఆర్‌ఎస్ నుంచి పాయం వెంకటేశ్వర్లు బరిలో దిగారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రేగాను విజయం వరించింది. దీం తో ఆయన రెండోసారి పినపాక అసెంబ్లీకి శాసనస భ్యుడిగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన రేగా కాంతారావు ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సారి బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కాం తారావు బరిలో ఉన్నారు. ఐదు నెలల క్రితం పాయం వెంకటేశ్వర్లు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకు న్నారు. అప్పటివరకు చాలామంది ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నించినా కాంగ్రెస్ అధిష్టానం పాయం వెంకటేశ్వర్లు వైపే మొగ్గుచూపింది. దీంతో పాత ప్రత్యర్థులు మూడోసారి పినపాక అసెంబ్లీ బరిలో తలపడనున్నారు. వీరిద్దరూ ఇప్పటికే చెరో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

అయ్యప్ప మాలధారుల సెల్‌ఫోన్లు చోరీ

జూలూరుపాడు: మండలంలోని పడమటన ర్సాపురం గ్రామంలో శనివారం అర్ధరాత్రి అయ్యప్ప మాలధారుల సెల్‌ఫోన్‌లను గుర్తుతె లియని వ్యక్తులు చోరీ చేశారు. రెండు రోజుల క్రితం పడమటనర్సాపురం గ్రామానికి చెందిన 18 మంది అయ్యప్పమాల దీక్ష తీసుకున్నారు. వీరంతా గ్రామంలోని శ్రీసీతారామాలయంలో పీఠం ఏర్పాటు చేసుకుని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధ రాత్రి మాలధారులు నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి ఆరు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. వీటి సుమారు రూ. లక్ష ఉంటుందని బాధితులు తెలిపారు. సెల్‌ఫోన్లు అపహరించిన గుర్తుతె లియని వ్యక్తులు బైక్‌పై కొత్తగూడెం వైపు పారిపోయినట్లు పేర్కొన్నారు. గత ఏడాది మాచినేనిపేటతండా అయ్యప్ప పీఠం వద్ద కూడా ఇలాగే జరిగింది.

కాంకేర్ జిల్లాలో ఎదురుకాల్పులు

● గాయాలతో తప్పించుకున్న పలువురు మావోలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో ఆదివారం ఉదయం పోలీసు బలగాలు, మావోయిస్టుల మధ్య హోరాహోరీ కాల్పులు జరిగాయి. ఈ ఘటనాస్థలి నుంచి మావో యిస్టులు తప్పించుకున్నారు. ఇందుకు సంబం ధించి కాంకేర్ జిల్లా ఎస్పీ దివ్యాంగ్ పటేల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాంకేర్ జిల్లాలోని తడోకి అటవీ ప్రాంతంలో మావో యిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, బీఎస్‌ఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా ఆది వారం ఉదయం మర్నార్ అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలకు తారసపడిన మావోయి స్టులు పోలీసు బలగాలపైకి కాల్పులు జర పడంతో పోలీసులు సైతం కాల్పులకుదిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గంటకుపైగా హోరాహోరీ కాల్పులు జరిగాయి. ఆ తర్వాత మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోగా ఆ ప్రాంతంలో మావోయిస్టుల శిబిరాన్ని పోలీ సులు ధ్వంసం చేసి సామగ్రిని స్వాధీనం చేసు కున్నారు. అయితే, ఈ ఎదురుకాల్పుల్లో పలు వురు మావోయిస్టులు గాయాలతో పారిపో యినట్లు అక్కడి రక్తపు మరకల ఆధారంగా పోలీసులు అనుమానిస్తున్నారు. తప్పిం చుకున్న మావోయిస్టుల కోసం అదనపు బలగాలను రంగంలోకి దించి కూంబింగ్ ఆప రేషన్ ముమ్మరం చేసినట్లు ఎస్పీ దివ్యాంగ్ పటేల్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

పకడ్బందీగా బందోబస్తు



కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

- విధుల్లో 1,500 మంది పోలీసు సిబ్బంది, అధికారులు
- సభ జరిగిన ప్రకాశం స్టేడియం చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు
- సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన విజయవంతం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పోలీసులు పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేప ట్టారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభకు సీఎం కేసీఆర్ హాజరుకావడంతో పార్టీ కార్యకర్తలు, అభి మానులు భారీగా తరలివచ్చారు. సభ ఆలస్యంగా ప్రారంభంకాగా, పలువురు రోడ్లపైనే వేచి ఉన్నారు. సుమారు 15 వేల మందికి పైగా ప్రజలు తరలిరావ డంతో సభా ప్రాంగణం చుట్టు పక్కల ట్రాఫిక్ ఆం క్షలు విధించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆంక్షలు ఉంటాయని ప్రకటించిన పోలీసులు గంట ముందు 11 గంటల నుంచే అమలు చేశారు. భద్రా చలం నుంచి ఖమ్మం వైపు వెళ్లే వాహనాలను కొత్త గూడెం పట్టణంలోకి సాయంత్రం 4 గంటల వరకు అనుమతించలేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బం దులు పడ్డారు. భద్రాచలం నుంచి పాల్వంచ మీదు గా టేకులపల్లి, ఇల్లెందు మీదుగా ఖమ్మం, భద్రాచ లం నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు పాల్వంచ నుంచి దమ్మపేట రోడ్, మాధారం, అన్నపురె డ్డిపల్లి, ఎర్రగుంట మీదుగా విజయవాడ రోడ్‌కు చేరేలా దారిమళ్లించారు. సభా సమయానికి ముందే విజయవాడ నుంచి రుద్రంపూర్, రామవరం మీదు గా వచ్చే వాహనాలను సింగరేణి హెడ్ ఆఫీస్ నుం చి దారి మళ్లించారు. మెయిన్ హాస్పిటల్ ఏరియా మీదుగా పాత కొత్తగూడెం, నవభారత్ మీదుగా పాల్వంచకు పంపించారు. ఖమ్మం జిల్లా నుంచి జూలూరుపాడు, సుజాతనగర్, విద్యానగర్ కాలనీ నుంచి బైపాస్, హెడ్ ఆఫీస్ మీదుగా పాత కొత్తగూ డెం వైపు, భద్రాచలం నుంచి విజయవాడకు వెళ్లే కొన్ని వాహనాలను ఓల్డ్ బస్టాండ్ నుంచి సూర్యో దయ పాఠశాల, పాత కొత్తగూడెం మీదుగా అను మతించారు. వాహనాలు బస్టాండ్ సెంటర్, పోస్టా ఫీస్ సెంటర్‌కు రాకుండా నియంత్రించారు. ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో పలువురు పనులు, ప్రయా ణాలు వాయిదా వేసుకున్నారు.



సభ ఆలస్యం కావడంతో రోడ్లపై వేచి చూస్తున్న ప్రజలు

1,500 మందితో భారీ బందోబస్తు

సీఎం కేసీఆర్ పర్యటనకు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రజా ఆశీర్వాద సభకు జిల్లా వ్యాప్తంగా డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబ ుళ్లు సుమారు 1500 మందికిపైగా బందోబస్తు విధు లు నిర్వర్తించారు. ఒక రోజు ముందే సభ ప్రాంగ ణానికి చేరుకుని ఆదివారం నుంచి విధులకు హాజరయ్యారు. సాయంత్రం వరకు ట్రాఫిక్‌ను చక్కదిద్దడంతోపాటు పటిష్టంగా బందోబస్తు చేప ట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సీఎం పర్యటన ముగియడంతో పోలీసు అధికారులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసు నమోదు

ములకలపల్లి : బెల్టుషాపులు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులపై ఆదివారం ఎక్సైజ్ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. మండలంలోని మూకమామిడి, ముత్యాలంపాడు, జగన్నాథపురం, రాజాపురం గ్రామాల్లో దాడులు చేసి రూ. 30 వేల విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకు న్నారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నట్లు ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్ తెలిపారు.

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి గ్రామా నికి చెందిన లావుడ్యా రమేష్ ఆదివారం ద్విచక్ర వాహనంపై అక్రమంగా 15 మద్యం బాటిళ్లు తర లిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. మద్యంను సీజ్ చేసి, నిందితుడిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ జయశ్రీ, ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

గుండాల: పురుగుల మందు తాగిన యువ కుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆళ్లపల్లి పోలీసుల కథనం ప్రకారం .. మండలంలోని రాఘవపురం గ్రామానికి చెందిన గొగ్గల చంద్రశేఖర్ (25) కొంతకాలం గా మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఈ నెల 3న మద్యం తాగొద్దని తల్లి అతన్ని హెచ్చరిం చింది. మనస్తాపం చెందిన చంద్రశేఖర్ అదే రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురు గుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆళ్లపల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెం దాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు.

ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్టు ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దమ్మపేట: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి బాలుర ఖో-ఖో జట్టును ఎంపిక చేసేందుకు మండలం లోని పార్కలగండి ఆశ్రమ పాఠశాలలో ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 85 మంది విద్యార్థులు హాజరు కాగా, ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 15 మందితో రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టు మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాందాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావుతోపాటు రామారావు, పవన్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7న విద్యార్థులకు జానపద, నృత్య పోటీలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, లోకల్ బాడీ, ఎయిడెడ్, కేజీబీవీలలో 8, 9 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఫోక్ గ్రూప్ డ్యాన్స్(జానపద నృ త్యం) పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ వెంకటేశ్వరా చారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులను పాఠశాల స్థాయిలో ఎంపిక చేసి 7వ తేదీ ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేలా చూడాలని ఎంఈఓలు, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలను ఆదేశించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఏమైనా సందే హాలుంటే జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు (98487 86166)ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికలను బహిష్కరించండి..


పోస్టర్లు వదిలిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీతోపాటు ఆ పార్టీకి మద్ద తునిస్తున్న బీఆర్‌ఎస్‌ను రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని, ప్రతిపక్ష పార్టీలనూ నిలదీస్తూ బూటకపు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని మావో యిస్టు రాష్ట్ర కమిటీ పేరిట ఆదివారం వాల్‌పోస్టర్లు వెలిశాయి. దుమ్ము గూడెం మండలంలోని తూరుబాక-రామకృష్ణాపు రం మధ్య బస్‌షెల్టర్‌లో ఈ పోస్టర్లు కనిపించాయి. గెలుపు కోసం బీఆర్‌ఎస్, పతిపక్షాలు నువ్వానేనా అన్నట్లు ప్రజలకు పోటీపడి వాగ్దానాలు ఇస్తుండడమే కాక, అవినీతిపరులు, దుర్మార్గులు గత పాలన లో చేసిన అవినీతిని మరిచి తాము నిజాయితీ పరులమని చెప్పుకుం టున్నారని విమర్శించారు. పాలకులపై విసుగెత్తిన ప్రజలను నమ్మించడానికి ఆక ర్షణీయంగా హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు నాయకులను ప్రశ్నించి ఆదివాసీల సమస్యల ను పరిష్కరించే వరకు ఎన్నికలను బహిష్కరిం చా లని మావోయిస్టులు ఆ పోస్టర్లలో పిలుపునిచ్చారు.

ఐఈడీ పేలుడులో మావోయిస్టు మృతి..

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత సుక్మా జిల్లాలో ఆదివారం జరిగిన ఐఈడీ పేలుడులో ఓ నక్సలైట్ మృతి చెందినట్టు తెలిసింది. అటవీప్రాంతంలో కూంబింగ్‌కు వచ్చే భద్రతా బలగాలే లక్ష్యంగా మావోయి స్టులు ఐఈడీలు అమర్చేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే ముకరం - మార్కగూడ మధ్య ఐఈడీ అమరుస్తుండగా భారీ పేలుడు సంభవించి, ఓ మావోయిస్టు మృతి చెందినట్టు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సతీష్ (ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘ టనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జి.రమణారెడ్డి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇల్లెం దు మిషన్ స్కూల్ సమీపంలోని లక్ష్మాద్రిదొడ్డి ఏరియాకు చెం దిన రైతు తేజావత్ సతీష్(38) సుజాతనగర్ మండలం సర్వారంలోని బంధువుల ఇంట్లో కర్మకాండలకు వెళ్లాడు. ఆదివారం ఇల్లెందులో తన అక్క కూతురు వివాహం ఉండగా, శనివారం రాత్రి 11 గంటలకు సర్వారం గ్రామానికి చెందిన మేనల్లుడు బాణోతు రవితో కలిసి బైక్‌పై ఇల్లెందుకు బయల్దేరాడు. ఈ క్రమంలో సాయన్నపేట మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలై స్పృహ కోల్పోయారు. రవి ఆది వారం ఉదయం స్పృహలోకి వ చ్చి చూసే సరికి సతీష్ తీవ్ర రక్త స్రావమై మృతి చెంది ఉన్నాడు. రవిని ఇల్లెందు ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.